క్లుప్తంగా

ప్రజా ప్రభుత్వంలో ప్రజారోగ్యానికి పెద్దపీట

- టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్



చెక్కు అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్

బాలానగర్: ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తున్నామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ అన్నారు. శనివారం బాలానగర్‌లోని సాయినగర్ ప్రాంతానికి చెందిన పాలడుగు వెంకట కృష్ణకు రూ.8.80 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన నివాసంలో నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో చందు, వినాయక నగర్ అధ్యక్షుడు సిద్ధు, లక్ష్మణ్, పుష్పారెడ్డి, మల్లికార్జున్ గౌడ్, యుగేందర్ రెడ్డి, పులి శివకుమార్ గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, మధు, రామ్మోహన్ రావు, భరత్ పాల్గొన్నారు.

నియామకం



సన్మానిస్తున్న ట్రస్ట్ పాలక కార్యవర్గం

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన రవీంద్రనాథ్ ఠాగూర్‌ను సేవా భారతి పబ్లిక్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మోతీనగర్ ట్రస్టీగా శనివారం నియమించారు. అనంతరం ట్రస్ట్ పాలక కార్యవర్గం ఆయనను ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో చైర్మన్ బి. సీతారామయ్య, వైస్ చైర్మన్‌రెడ్డి, కోశాధికారి నాగేశ్వరరావు, ట్రస్టీలు సీఎస్ఆర్ మూర్తి, పీఏఎస్ మూర్తి, జి. ఉమా మహేశ్వర రావు, సుబ్బరామయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేజ్‌లోని కాలనీ వాసుల విజ్ఞప్తి మేరకు శనివారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఎస్ఎస్ఎల్ మాల్ దగ్గర మూసివేసిన రోడ్డును తెరిచి ప్రస్తుతం ఉన్న యోగా సెంటర్ వద్ద యుటర్న్ తీసి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వద్ద యూ టర్న్ ఇవ్వాలని కాలనీ వాసులు కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముగ్ధా షోరూం ప్రారంభించిన ప్రముఖ నటి



కూకట్‌పల్లి: ముగ్ధా 2.0 కేపీహెచ్‌బీ కాలనీలో బ్లాక్ బస్టర్ చిత్రం ఓజీ ప్రముఖ నటి ప్రియాంక మోహన్ ముగ్ధా వ్యవస్థాపకురాలు శశి వంగపల్లితో కలిసి శనివారం పునఃప్రారంభించారు. అసాధారణమైన డిజైన్‌లు, తాజా ట్రెండింగ్ చీరలు, ప్రత్యేకమైన చేనేత చీరలు అందుబాటులో ఉన్నాయని, సరసమైన ధరలతో అందజేస్తున్నామని నిర్వాహకురాలు తెలిపారు. ప్రతి రూ.50 వేల కొనుగోలుపై రూ.10 వేల విలువైన షాపింగ్ అదనంగా అందిస్తున్నామని తెలిపారు.

పైపులైన్ లీకేజీలతో తాగునీరు వృథా!



తాగునీటిలో కలుషిత జలాలు సరఫరా

- తాత్కాలిక మరమ్మతులు.. మళ్లీ లీకేజీలు
- పట్టించుకోని అధికారులు

మంచినీటి ప్రధాన పైపులైన్ పగిలి లక్షలాది గ్యాలన్ల తాగునీరు రోడ్లపై ఏరులై పారుతున్నాయి. సంబంధిత అధికారులు పైపులైన్ పనులను పర్యవేక్షించకుండా సదరు కాంట్రాక్టర్‌లతో పని చేయిస్తూ మమ అనిపించి చేతులు దులుపుకుంటున్నారు.మరమ్మతులు చేసి ఒక్కరోజు కూడా గడవక ముందే మళ్లీ పైపులైన్ పగిలి విలువైన తాగునీరు వృథా అవుతుంది. లీకేజీలతో కలుషిత నీరు చేసి సరఫరా అవుతుంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– ఆల్విన్‌కాలనీ

కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్‌కాలనీ పైపులైన్ రోడ్డులోని సాయినగర్ కమాన్ ఎదురుగా రోడ్డులో పైపులైన్ పగిలి తాగునీరు వృథా అవుతుంది. కలుషిత జలాలు కలిసి సరఫరా కావటంతో వ్యాధుల భారిన పడుతున్నామని స్థానికులు మొరపెడుతున్నారు. ఈ రహదారిలో మంచినీటి పైపులైన్ నిర్మించి సుమారు 5 దశాబ్దాలు గడిచాయి. ప్రధాన రహదారి ఇరుకుంగా ఉంటుంది. రోడ్డుకు ఇరువైపులా మంచినీటి పైపులైన్‌లు ఉండటంతో పైపులైన్‌కు లీకేజీలు ఏర్పడుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. లీకేజీ ఏర్పడినప్పుడు మరమ్మతులు చేసి మమ అనిపిస్తున్నారు. మళ్లీ లీకేజీలతో సమస్య మెదటికే వస్తుంది. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో వల్లే తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల క్రితం కలుషిత జలాల ద్వారా అనారోగ్యాల పాలవుతున్నారని, పైపులైన్‌లను మార్చాలని స్థానిక సంక్షేమ సంఘాల నాయకులకు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి పైపులైన్ లీకేజీలు ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.



ఆల్విన్‌కాలనీ సాయి నగర్ కమాన్ ఎదురు వీధిలో ..



కలుషిత నీరు సరఫరా అవుతుంది



పదే పదే మంచినీటి పైపులైన్‌లు లీకేజీలతో తాగునీరు వృథాగా పోతున్నాయి. కలుషిత నీరు సరఫరా అవుతున్నది. లీకేజీల సందర్భాల్లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కొరవడింది. కలుషిత జలాలతో ప్రజలు అనారోగ్యాల భారిన పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు మంచినీటి పైపులైన్ లీకేజీ పట్ల శ్రద్ధ వహించి పైపులైన్‌లు పగిలిపోకుండా చర్యలు తీసుకోవాలి.

– నరేందర్ రెడ్డి, స్థానికుడు

51వసంతాలు.. 25వ స్నాతకోత్సవం

- 1717 మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం
- 182 మెడల్స్.. 242 మందికి పీహెచ్‌డీలు

7వ తేదీ నిర్వహించేందుకు ఏర్పాట్లు



హెచ్‌సీయూ ప్రధాన ద్వారం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) 25వ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్టోబర్ 7వ తేదీన గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో ఉదయం 10.45 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. 1974లో ఏర్పాటైన హెచ్‌సీయూ 51 ఏళ్లు రాగా 25వ స్నాతకోత్సవాన్ని జరుపుకోనుంది. స్నాతకోత్సవంలో డిగ్రీలు,మెడల్స్, పీహెచ్‌డీల ప్రదానం చేయనున్నారు.

- 1,717 మంది విద్యార్థులకు డిగ్రీల ప్రదానం
- 182 మంది ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్
- 242 మందికి పీహెచ్‌డీ డిగ్రీలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

ముఖ్యఅతిథిగా డాక్టర్ కృష్ణ ఎల్లా..

వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పర్యవేక్షణలో చాన్స్‌లర్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగే స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణా ఎల్లా ,హెచ్‌సీయూ చీఫ్ రెక్టార్ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ గెస్ట్ ఆఫ్ హానర్‌గా విచ్చేస్తారు. కాగా హెచ్‌సీయూ క్యాంపస్ నుంచి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియం వరకు విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

హెచ్‌సీయూకు 2025లో ప్రత్యేక గుర్తింపులు

- ప్రపంచవ్యాప్తంగా 34 మంది హెచ్‌సీయూ ఫ్యాకల్టీలకు 2 శాతం అత్యుత్తమ అధ్యాపకులుగా ఆగస్టు–2025లో స్టాన్‌ఫోర్డ్/ఎల్సేవియార్ సంస్థ గుర్తింపునివ్వడం విశేషం. హెచ్‌సీయూకు ప్రత్యేక స్థానం కల్పించినట్లయింది.
- నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్)–2025లో స్థానం లభించింది. ముఖ్యంగా ఎన్ఐఆర్ఎఫ్–2025 ర్యాంకింగ్స్‌ను అయిదు పారామితుల ఆధారంగా ర్యాంక్‌ను కేటాయించారు. ముఖ్యంగా బోధన, అభ్యాసం, వనరులు, పరిశోధన, వృత్తిపరమైన అభ్యాసం, గ్రాడ్యుయేషన్ ఫలితం, ఔట్రీచ్, ఇన్‌క్లూజివిటీ, పర్సెప్షన్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ర్యాంకింగ్స్‌ను ఆయా ఉన్నత విద్యాసంస్థలకు కేటాయించారు.

ఎన్ఐఆర్ఎఫ్–2025 ర్యాంకింగ్స్ వివరాలు ఇవే..

- హెచ్‌సీయూ ఓవరాల్ కేటగిరిలో 26వ స్థానం
- విశ్వవిద్యాలయం కేటగిరిలో 18వస్థానం
- ఇంజనీరింగ్ విభాగంలో 74వ స్థానం
- పరిశోధనల సంస్థల కేటగిరిలో 32వ స్థానం.

శివోహం చిత్ర ప్రదర్శన



మాదాపూర్: కళాకారిణి శిల్పా కాసు వేసిన చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ఏర్పాటు చేసిన శివోహం చిత్ర ప్రదర్శనను సీనియర్ కళాకారులు రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. మహాశివుని రూపాలను అద్భుతంగా వేశారని కొనియాడారు. ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న చిత్రప్రదర్శనలో 76 చిత్రాలను అందుబాటులో ఉంచినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో కళాకారులు, ఆర్ట్‌గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనం

మోతీనగర్: గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు హిందూ, ముస్లిం ఐక్యతకు నిదర్శనమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ అన్నారు. శనివారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్, వి. రామారావు నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ వాజిద్ భాష ఆధ్వర్యంలో జరిగిన గ్యార్వీ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ మతాలను గౌరవిస్తూ ఇతర మతాల వారితో కలిసిమెలిసి పండుగలను జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ మొయిజ్, పి. విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ తదితరులు

పార్కుల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని పార్కుల అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నరసింహయాదవ్ అన్నారు. శనివారం డివిజన్‌లోని హెచ్ఏఎల్ పార్కులో రూ. 15 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. డివిజన్‌లో ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ ఆశ, డివిజన్ సెక్రటరీ హరినాథ్, మైపాల్ రెడ్డి, రాజేశ్వరరావు, రాంబాబు, బాబన్న, రాజ్ కుమార్, కాళిదాస్, కనకదాస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన స్వరార్చన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్యస్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీమయి స్వరార్చన కార్యక్రమంతో సందర్శకులను అలరించారు. చల్లామారుతి కిరణ్ విద్యార్థిని శ్రీమయి మహా గణపతిం, శక్తి సహిత, శ్రీమన్నారాయణ, ముద్దుగారే యశోద, కొండలలో నెలకొన్న కోనేటి రాయుడు వాడు, చక్కని తల్లికి, జగడపు, ఎక్కడి మానుష, శరణు శరణు, గరుడ గమన, అయిగిరి నందిని, గోవిందనామాలు కీర్తనలను ఆలపించారు. వయోలిన్ ధనుంజయ, మృదంగం మల్లికార్జున సంగీత సహకారాన్ని అందించారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నందకుమార్ కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

పెయిన్ స్కేప్-2025 సదస్సు ప్రారంభం

నొప్పిని మరిపించే 'ఎక్స్ఆర్ టెక్నాలజీ'

- గచ్చిబౌలి కిమ్స్ ఆస్పత్రిలో తొలిసారి ఆవిష్కరణ
- కిమ్స్ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు వెల్లడి
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 160 మంది వైద్యుల హాజరు



కిమ్స్ ఆస్పత్రిలో 'ఎక్స్ఆర్ టెక్నాలజీ' పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎండీ డా.భాస్కర్‌రావు వైద్యులు

రాయదుర్గం: అన్ని రకాల నొప్పులను మర్చిపోయేలా 'ఎక్స్ఆర్' అనే సరికొత్త టెక్నాలజీని ఆవిష్కరించినట్లు కిమ్స్ ఆస్పత్రుల చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని కిమ్స్ ఆస్పత్రిలో 'పెయిన్ స్కేప్–2025' పేరిట నిర్వహించిన సదస్సును ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని శస్త్ర చికిత్సల వల్ల దీర్ఘకాలం పాటు నొప్పి ఉంటుందని, కొన్నిసార్లు కండరాల నొప్పి వస్తుందన్నారు. క్యాన్సర్ చికిత్స వల్ల నరాల్లోనూ, మెడ, తలనొప్పి లాంటివి వేధిస్తుంటాయన్నారు. గర్భిణుల ప్రసవ నొప్పులకు పరిష్కారంగా ఈ ఎక్స్ఆర్ టెక్నాలజీ ఉపయోగపడుతుందన్నారు. ఆస్పత్రి అసోసియేట్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ అంకిత ఆర్ చావ్లా మాట్లాడుతూ రోగులకు ఎక్స్ఆర్ టెక్నాలజీ హెడ్ సెట్ తగిలిస్తే మరో లోకంలోకి వెళ్లినట్లే భావన కలుగుతుందన్నారు. పిల్లలకు ఇంజెక్షన్ చేసే ముందు లేదా కాన్యులా పెట్టే ముందు ఈ ఎక్స్ఆర్ (ఎక్స్‌టెండెడ్ రియాలిటీ) హెడ్‌సెట్ తగిలిస్తే ఎక్కడో మైదానంలో ఆడుకుంటున్నట్లు కనిపిస్తుందని సులభంగా ఇంజెక్షన్ చేయవచ్చని, కాన్యులా పెట్టవచ్చని వివరించారు. ఈ సదస్సులో కిమ్స్ ఆస్పత్రి మెడికల్ ఎడ్యుకేషన్, అకడమిక్స్ డైరెక్టర్ డాక్టర్ మణిమాలారావు, ఆస్పత్రి క్లస్టర్ హెడ్ కిషోర్‌రెడ్డి, నిమ్స్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, న్యూఢిల్లీ గంగారాం ఆస్పత్రి పెయిన్ రిలీఫ్ యూనిట్ డైరెక్టర్, పెయిన్ మెడిసిన్ అధ్యుడు డాక్టర్ ప్రదీప్‌జైన్, డాక్టర్ మురళీధర్ జోషి, నిమ్స్ అనస్థీషియా విభాగం అదనపు డైరెక్టర్ డాక్టర ఆఖ్య కుమార్‌కర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 160 మంది వైద్యులు పాల్గొన్నారు.

ఆగుతూ.. సాగుతూ..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నత్తనడకన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

- మొత్తం వచ్చిన దరఖాస్తులు 1.47లక్షలు
- మొదటి విడతలో 1,775 మందికి మంజూరు
- నిధుల విడుదల జాప్యంతో నెమ్మదించిన పనులు
- పూర్తయినవి 25 గృహాలు మాత్రమే
- బేస్‌మెంట్ లెవల్‌లో 624, రూఫ్ లెవల్‌లో 284



సాక్షి,మేడ్చల్ జిల్లా: జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. నిధుల విడుదలలో జాప్యం.. పలు సాంకేతిక సమస్యల నేపథ్యంలో చాలావరకు పునాది దశల్లోనే దర్శనమిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం 1.47 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నా.. ఇందులో స్థలం లేని వారే అధికంగా ఉండడంతో మొదటి విడతలో 1,775 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేశారు. ఇప్పటివరకు బోడుప్పల్ పురపాలక సంఘంలో 118 ఇండ్లు, దమ్మాయిగూడలో 128, ఘట్‌కేసర్‌లో 149, గుండ్ల పోచంపల్లిలో 20, జవహర్‌నగర్‌లో 139, మేడ్చల్‌లో 280, ఎంసీపల్లిలో 253, నాగారంలో 112, పీర్జాదిగూడలో 75, పోచారంలో 82, తూంకుంట పురపాలక సంఘంలో 55, మేడ్చల్ మండల పరిధిలో 151, శామీర్‌పేట మండలంలో 204 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. వీటిలో బేస్‌మెంట్ దశలో 624 ఇండ్ల నిర్మాణం కొనసాగుతుండగా, రూఫ్ లెవల్‌లో 284, మార్కింగ్ లెవల్‌లో 905 ఉన్నాయి. మిగతావి చివరి దశలో ఉన్నప్పటికీ, ఫినిషింగ్ పూర్తయిన ఇండ్లు మాత్రం 25కు మించకపోవడం గమనార్హం.

నిబంధనలే ప్రతిబంధకం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం చేపట్టాలంటే షరతులు ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. ఫలితంగా నిర్మాణంలో జాప్యం.. నిధుల విడుదల్లో ఆలస్యం జరుగుతోందన్న అభిప్రాయాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 400–600 లోపు చదరపు అడుగుల ఫీట్లు (45–65 గజాలు) స్థలంలోనే ఇల్లు నిర్మించాలి. అన్ని సౌకర్యాలతో అనుకూలంగా నిర్మించుకునేందుకు దశలవారీగా ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది.

పనుల వేగవంతంపై దృష్టి..

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు కలెక్టర్, గృహ నిర్మాణ శాఖ పీడీ కలిసి నిర్మాణాలను పరిశీలిస్తున్నారు. వార్డు ఆఫీసర్, కమిషనర్, మండలాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షలు నిర్వహిస్తూ పనులు ఊపందుకునేలా చర్యలు తీసుకుంటోంది.

స్థలం లేకున్నా.. ఇండ్ల కోసం దరఖాస్తు

జిల్లాలో వలస కుటుంబాలు అధికంగా ఉన్నాయి. బతుకుదెరువు కోసం తెలంగాణలో వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అద్దె ఇండ్లలో నివాసముంటున్న వలస కుటుంబాలతోపాటు జిల్లాలోని 16 పురపాలక సంఘాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ మున్సిపల్ సర్కిళ్లలోని స్లమ్ ఏరియాలు, గుడిసెవాసుల కాలనీలు, గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న చాలామంది నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలోనే 1.47లక్షల దరఖాస్తులు అందాయి. అయితే వీరిలో చాలామందికి నివాస స్థలాలు లేకపోవడంతో ఇండ్లు మంజూరు చేయడం అధికార యంత్రాంగానికి పెద్ద సమస్యగా మారుతోంది. ఈ నేపథ్యంలో ఇందులో అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై మున్సిపల్ కమిషనర్లు కసరత్తు చేస్తున్నారు. ఎంపిక తర్వాత..అక్కడే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకునేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. రెండో విడతలో భాగంగా 1,725 ఇండ్లు మంజూరు చేసేందుకు లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు జరుగుతోంది. జిల్లాలో 5 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఒక్కో నియోజకవర్గానికి 3,500 చొప్పున 17,500 ఇండ్లు మంజూరు కానుండడంతో.. ప్రస్తుతం మంజూరు చేసిన 1,775 ఇండ్లు మినహాయించి మిగతా వాటిని గుర్తించిన స్లమ్ ఏరియాల్లోని అర్హులకు కేటాయించి రీ-డెవలప్‌మెంట్ పథకం కింద వారికి అక్కడే (పాత నివాసం స్థానంలో) ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కార్యక్రమాలకు అధికార యంత్రాంగం శ్రీకారం చుడుతోంది. ముఖ్యంగా పురపాలక సంఘాలు ఈ బాధ్యతను నిర్వర్తించేలా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

పూర్తయినవి 25 మాత్రమే..

జిల్లాలో 1,775 ఇండ్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 25 ఇండ్లు మాత్రమే పూర్తి కాగా, మిగతావి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. పూర్తి అయిన వాటికి ఆర్థిక సాయం పూర్తి స్థాయిలో అందగా, వివిధ దశల్లో ఉన్నవాటికి ప్రతీ సోమవారం అందజేస్తున్నారు.

కనువిందుగా..



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలలో భాగంగా శనివారం బెంగుళూరికి చెందిన భరతనాట్య గురువు రాగిణి , రక్షిత రఘునాథన్ శిష్యబృందం మల్లారి, తోదయ మంగళం, పుష్పాంజలి, అలరిపు, నటేశకౌతం, రామ నవరస, సాధించని, అలరులు కురియగా, శ్రీ సరస్వతి, భో శంభో, దశావతారం, తిల్లాన తదితర అంశాలను అమ్రితా, అనన్య, వైష్ణవి, అనన్య అనూప్ శతాక్షి, అనివార్థి, నక్షత్రలు ప్రదర్శించి అలరించారు. మేళాలో పలు స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. ఈనెల 5వ తేదీ వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాలలో నగరవాసులు చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు.